# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువపారిశ్రామికవేత్తలకు సూచించారు.**
2. **న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేయడమే ఇ-కోర్ట్ ప్రాజెక్ట్ లక్ష్యమని హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు పేర్కొన్నారు.**
3. **రాజధాని అమరావతిలో అధికారుల కోసం చేపట్టిన 14 టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు.**
4. **యూరియా సరఫరా గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు.**
5. **విశాఖ మహానగరం అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు.**

=========================

పరిశ్రమల ఏర్పాటుతో సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువపారిశ్రామిక వేత్తలకు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో యువపారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్పత్తులు తయారు చేయడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పర్యాటకం, రక్షణ, అంతరిక్ష, ఎలక్ట్రానిక్స్, సరుకు రవాణా తదితర రంగాల్లో అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్ మిషన్ కారిడార్ ఏర్పాటు కానుందని, అలాగే విశాఖపట్నంలో గూగుల్ సంస్థ అతి పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

న్యాయ వ్యవస్థలో డిజిటల్ అంతరాన్ని తగ్గించి, న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేయడమే ఈ-కోర్ట్ ప్రాజెక్ట్ లక్ష్యమని హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ-సేవా కేంద్రాన్ని రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ చల్ల గుణ రాజన్‌లతో కలిసి నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఈ-కోర్టు ప్రాజెక్టులో భాగంగా ఈ-సేవా కేంద్రం ఏర్పాటు చేయడం

జరిగిందన్నారు. ఈ కేంద్రాలు న్యాయవాదులు, కక్షిదారులు, సాధారణ ప్రజల కోసం ఒకే వేదికపై అనేక డిజిటల్ సేవలను అందిస్తాయని వెల్లడించారు.

---------------------------

రాజధాని అమరావతిలో అధికారుల కోసం చేపట్టిన 14 టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు. రాజధానిలో వివిధ నిర్మాణ పనులను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాజధానిలో అధికారుల కోసం 4 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వీటిని వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేస్తామన్నారు. ఐఎఎస్ అధికారులకు చేపట్టిన టవర్లు దాదాపు పూర్తయినట్లు చెప్పారు. అంతర్గత రహదారుల నిర్మాణం జరుగుతందని మంత్రి పేర్కొంటూ...

..వాయిస్... 24 సెకన్లు

---------------------------

యూరియా సరఫరా గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. నంద్యాలలో యూరియా సరఫరాపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... యూరియా సరఫరా విషయంలో క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 5వేల 200 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరిగిందని, వచ్చే వారం రోజుల్లో మరో 4 వేల 100 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరనుందని పేర్కొన్నారు.

---------------------------

విశాఖ మహానగరం అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. విశాఖ కలెక్టరేట్ లో జిల్లా సమీక్షా మండలి సమావేశాన్ని మంత్రి నిన్న నిర్వహించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సుందరీకరణ, విద్యుదీకరణ, పట్టణీకరణ మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత సమావేశంలో చర్చించిన అంశాల్లో చాలా వరకూ పరిష్కరించామని మంత్రి పేర్కొంటూ..

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

అనంతపురంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' రాష్ట్ర స్థాయి విజయోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు పి.కేశవ్, ఎ.సత్యప్రసాద్, ఎస్ సవిత, డాక్టర్ పి నారాయణ, కె.రవీంద్ర, ఎం.రాంప్రసాద్ రెడ్డి, జి.రవికుమార్ లు సంయుక్తంగా నిన్న పరిశీలించారు. ఈ విజయోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్, భోజన వసతి, వేదిక ఏర్పాటు, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రణాళిక బద్ధంగా పనులను పూర్తి చేయాలని కార్యక్రమ నిర్వహణ బృందానికి సూచించారు. ఈ విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారని వెల్లడించారు.

--------------------------

రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతుందని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని ఈ రోజు మంత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని పొందగలిగామన్నారు.

--------------------------

ప్రపంచ భద్రతలో చట్టాల అమలు యొక్క కీలక పాత్రను గుర్తిస్తూ.. ఈ రోజు అంతర్జాతీయ పోలీసు సహకార దినోత్సవం జరుపుకుంటున్నాము. ఈ ఏడాది పోలీసింగ్‌లో కమ్యూనికేషన్ టెక్నాలజీ, సమచారం, కృత్రిమ మేథ వినియోగం ఇతివృత్తంగా నిర్ణయించడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పోలీసుల మధ్య సహకారం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. సమగ్రత, జవాబుదారీతనం, పర్యవేక్షణను నిర్ధారించడానికి సమగ్ర చట్టం యొక్క అవసరాన్ని స్పష్టం చేస్తుంది.

--------------------------

బీహార్‌లోని రాజగిర్ లో జరుగుతున్న ఆసియాకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. నిన్న జరిగిన సూపర్-4 ఆఖరి మ్యాచ్‌లో భారత జట్టు 7-0తో చైనాను ఓడించింది. ఆట 4వ నిమిషంలో శిలానంద్ గోల్‌తో జోరు మొదలుపెట్టిన భారత జట్టు.. చివరి క్వార్టర్ వరకూ పైచేయి కొనసాగిస్తూనే ఉంది. ఈ క్రమంలో దిల్ ప్రీత్, మన్‌దీప్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, సుఖ్ జీత్ సింగ్, ఒక్కో గోల్ చేశారు. చివర్లో అభిషేక్ రెండు గోల్స్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఒక్క పెనాల్టీకార్నర్ కూడా ఇవ్వలేదు. ఫైనల్ మ్యాచ్‌లో ఈరోజు కొరియా జట్టుతో భారత్ జట్టు తలపడనుంది.

--------------------------

వాయవ్య బంగాళాఖాతం, దాని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిషా, ఉత్తర కోస్తాంధ్ర తీరప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..18 సెకన్లు

=====================